www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 13 జూన్ 2025
5
చిత్తూరు



మా ఊరి బడి మార్చొద్దు..

- పాఠశాల గేట్‌కు తాళం వేసి గ్రామస్తుల నిరసన



స్కూల్ ఎదుట నిరసన తెలుపుత్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

తమకు అనుకూలంగా ఉన్న గ్రామంలోని బడిని మూసేసి దూరంగా ఉన్న మరో పాఠశాలకు మార్చడానికి నిరసిస్తూ గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటవ డివిజన్ మురకంబట్టు అగ్రహారంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మురకంబట్టుకు మార్చాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాలల పున్ణ ప్రారంభం మొదటి రోజున అగ్రహారం మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను మురకంబట్టు మరో పాఠశాలకు పంపడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉండేదని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి మరో పాఠశాలకు వెళ్ళమని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తమ గ్రామంలోని పాఠశాల విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను కొనసాగించాలని కోరారు. మురకంబట్టు అగ్రహారంలోని ప్రభుత్వ పాఠశాల చక్కటి పల్లెటూరి వాతావరణంతో విశాలమైన మైదానంలో కలిగి అన్ని సౌకర్యాలు ఉన్న తమ స్కూలుని ఎటువంటి బ సౌకర్యం లేని రోడ్డుకు అతి సమీపంలో ఉన్న ముర్కంబుట్ట స్కూలుకు మార్చడం తగలని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల అంగీకారం మేరకే భూసేకరణ: జెసి



శాంతిపురం గ్రామ సభలో మాట్లాడుతున్న జెసి విద్యాధరి



రామకుప్పం గ్రామసభలో మాట్లాడుతున్న జెసి, ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- శాంతిపురం: రైతుల అంగీకారంతోనే కుప్పం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ కొరకు భూసేకరణ జరుగుతుందని, బలవంతపు భూసేకరణ మాత్రం జరగదని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి స్పష్టం చేశారు. గురువారం శాంతిపురం, రామకుప్పం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో భూసేకరణపై దండికుప్పం, 30 సోనియాగానిపల్లి, అమ్మవారిపేట రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రెవెన్యూ గ్రామాలకు చెందిన రైతుల అభిప్రాయాలను జెసి అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రైతులు మాట్లాడుతూ కుప్పం ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం చేపడుతున్న భూసేకరణలో తరతరాలుగా వారసత్వంగా వచ్చిన తమ భూములను ప్రభుత్వం తీసుకోవడంతో తాము సర్వం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కలు ముక్కలు చేసుకొని రాళ్ల రప్పలు తొలగించి లక్షల రూపాయలు ఖర్చు చేసి వ్యవసాయానికి అనుకూలంగా మలుచుకున్న వ్యవసాయ భూములే తమ జీవనాధారంగా జీవిస్తున్నామని, తమ భూములను ఎయిర్ పోర్టుకు తీసుకుంటే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. భూములను కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయంగా భూములను ఇవ్వాలని, అలాగే ఇళ్లు కోల్పోతున్న వారికి ఇంటి పట్టాలి ఇచ్చి ఇల్లు కట్టివాలని కోరారు. ఉన్నత చదువులు చదివి ఇంటివద్ద వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే 2017లో ఏర్పోర్ట్ నిర్మాణం కోసం రైతుల నుండి సేకరించిన భూములకు ఇప్పటివరకు పరిహారం అందించలేదని జెసి దృష్టికి తీసుకువచ్చారు. భూ సేకరణ కోసం చేపడుతున్న సర్వేలను అడ్డుకుని భూములను ప్రభుత్వానికి ఇవ్వకుంటే ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకి రూ.16 లక్షల పరిహారం అందివ్వమని రూ.10 లక్షల మాత్రమే వచ్చేటట్టు చేస్తామంటూ కొంతమంది అధికారులు బలవంతపు భూసేకరణ చేయడానికి పాల్పడుతున్నట్లు జెసికి తెలిపారు. అనంతరం జెసి మాట్లాడుతూ ఈ భూసేకరణలో భాగంగా రైతులకు పరిహారంగా ఎకరాకు రూ.16 లక్షలు చెల్లిస్తామన్నారు. అలాగే ఆ భూముల్లో రైతులు చేపట్టిన నిర్మాణాలకు వృక్షాలు చెట్లు, బోర్లు, కోళ్ల ఫారాలు వంటి వాటికి కూడా పరిహారం చెల్లిస్తామన్నారు. ఈ భూసేకరణ ప్రభుత్వ చట్టప్రకారం నిబంధనలకు లోబడి చేపట్టడం జరుగుతుందన్నారు. భూములు కోల్పోయే ప్రతి ఒక్కరికి పరిహారం ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చెల్లిస్తామని అంతేగాని ఒకరికి ఎక్కువ ఒకరికి తక్కువ చెల్లించే ప్రసక్తే లేదన్నారు. అలాగే అధికారులు, సిబ్బంది ఎవరైనా బెదిరింపులకు పాల్పడి రైతులను బెదిరించినట్లయితే తమ దృష్టికి వచ్చిన వెంటనే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2017లో భూసేకరణ చేసిన భూములకు ఏఏ రైతులకైతే ఇంతవరకు పరిహారం అందలేదో వారికి ఆరోజు నిర్ణయించిన ధరకు మొత్తం డబ్బులకు వడ్డీ లెక్కించి వారికి కూడా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నేరుగా పరిశీలించి వారికి న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా రైతులు పలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. అనంతరం భూసేకరణ చేపట్టే ప్రాంతాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు. జెసి వెంట కుప్పం ఆర్డీవో శ్రీనివాసరావు, తహశీల్దార్ శివయ్య, రెవెన్యూ సిబ్బంది, పలువురు రైతులు ఉన్నారు.

రామకుప్పం: కుప్పం నియోజక వర్గ పరిధిలోని రామకుప్పం మండల పరిధిలో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ కోసం భూములు అందించే రైతులకు ఎకరాకు రూ.16 లక్షలు అందించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకొని న్యాయం చేస్తుందని చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. గురువారం ఏర్పోర్ట్ నిర్మాణం కోసం మండలంలోని అంకిరెడ్డిపల్లి, కిలాకిపోడు, కడిసిన కుప్పం, మణింద్రం, బొందల కుంట రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ భూసేకరణ నిమిత్తం బాధిత రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని రైతులకు భరోసా కల్పించారు. గత 2017లో రైతులకు ఇచ్చిన భూ సేకరణ నగదును పెంచాలని రైతులు కోరగా అప్పటి ధరలకు నష్టపరిహారం అందించడం జరిగిందన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు రైతులకు నగదు జమ కాకుంటే వారి ఖాతాలకు సర్వే చేయించి నగద జమ చేస్తామన్నారు. కుప్పం ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలను ఎగమతులు చేసేందుకు ప్రభుత్వం మినీ ఎయిర్పోర్ట్ నిర్మాణానికి పూనుకుందని, దీంతో రైతులకు లాభాలతో ఆర్థిక అభివృద్ధి పొందవచ్చు అన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, రాష్ట్ర నేత డాక్టర్ సురేష్ బాబు టిడిపి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

రేపు సచివాలయాల ప్రాంగణంలో మెగా డ్రిల్: డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 14వ తేదీన ఆయా సచివాలయాల ప్రాంగణంలో మెగా డ్రిల్ ఘనంగా నిర్వహించాలని డిఆర్ఓ మోహన్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్‌లో జిల్లాలోని ఆర్డీవోలతో, మున్సిపల్ కమిషనర్లు, ఎమ్మార్వోలతో, ఎంపీడీలుతో, మండల విద్యాశాఖ అధికారులతో యోగ ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 8,60,000 మంది కార్యక్రమాలపై రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. ఈనెల 14వ తేదీన అన్ని గ్రామ, వార్డు సచివాలయ ఆవరణలో, రైతు భరోసా కేంద్రాలలో, ఉదయం సమయంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. 120 మాస్టర్ ట్రైనర్స్,5700 మెగా ట్రైనర్స్, 5700 వెన్యులలో కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలలో ప్రతి ఒక్క సిబ్బంది యోగా కార్యక్రమాలలో పాల్గొనాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులచే యోగ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

అసంబద్ధ బదిలీలు వెంటనే ఆపాలి

బదిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన




బదిలీల కౌన్సిలింగ్లో అన్యాయం జరిగిందంటూ నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉపాధ్యాయులు బదిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. అసంబద్ధ బదిలీలు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు. భార్యాభర్తల బదిలీలపై డీఈవో వైఖరి నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాము ఇప్పటివరకు సుదూర ప్రాంతాల్లో పనిచేసిన భార్య భర్తలు సొంత మండలాల్లో పనిచేసుకునే అవకాశం వచ్చిందని, అయితే జిల్లా విద్యాశాఖ అధికారి తమ విన్నపాలను, జీవో నిబంధన పాటించకుండా సొంత నిర్ణయాలతో కౌన్సిలింగ్ జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం

ప్రజాశక్తి- కుప్పం రూరల్



కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి.నాగరాజు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం యోగ ఆంధ్ర ఆరోగ్య ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం తమ కళాశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించామన్నారు. ప్రతినిత్యం యోగ ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, ప్రజలు తప్పనిసరిగా యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. అనంతరం యోగ శిక్షకులను అభినందించారు. కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్ రాజు, కళాశాల ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సంబరాలు



కుప్పంలో..

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కూటమి ప్రభుత్వ తొలి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసే నివాళులు అర్పించారు. అనంతరం చెక్ కట్ చేసి, పంచిపెట్టుకొని సంబరాలు జరుపుకున్నారు.

గంగాధర నెల్లూరు: గురువారం కూటమి ప్రభుత్వం వచ్చి సుపరి పరిపాలనకు ఏడాది పూర్తి అవడంతో మండల మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో భారీ కేక్ కట్ చేసి కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. కృష్ణమనాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామి దాస్, దేవ సుందరం పాల్గొన్నారు.



పలమనేరులో..

పలమనేరు: పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నేతలు గురువారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని వారు కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. విష్ణువర్ధన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం గౌడ్, కుట్టీ, నాగరాజు రెడ్డి, సోమశేఖర్ గౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. లోకనాథం నాయుడు, రుద్రప్ప నాయుడు, రాజశేఖర్ నాయుడు, వేమనాయుడు, భాస్కర్ నాయుడు, వెంకటాచలం, హేమాద్రి యాదవ్, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురంలో..

సుపరిపాలనలో తొలి అడుగు: మధురాయల్

పుంగనూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా తల్లికి వందనం పథకంలో వారి ఖాతాలకు నగదు జమ చేయడం జరిగిందని సుపరిపాలనలో తొలి అడుగు పడిందని టిడిపి సీనియర్ నాయకుడు మధుసూదన్ రాయల్ అన్నారు. పుంగనూరులో పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం 65 లక్షల తల్లులు ఖాతాలో ప్రభుత్వం ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున రూ.8745 కోట్లు జమ చేసిందన్నారు. మోహన్ నాయుడు, నూరుల్లా, అనిల్ రాయల్, సయ్యద్, జగదీష్, పర్వేజ్, ముబారక్, ముజ్జు, సుధీర్, రఘుపతి నాయుడు పాల్గొన్నారు.



పుంగనూరులో..

మాట నిలుపుకున్న కూటమి: రెడ్డప్ప నాయుడు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ 6 హామీలలో భాగంగా నేడు తల్లికి వందనం పథకం లో తల్లుల ఖాతాలో నగదు జమ చేసి మాట నిలబెట్టుకున్నదని జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పాలడుగు రెడ్డప్ప నాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మాట ఇచ్చారంటే చేసి చూపిస్తారు అనడానికి ఇది నిదర్శనం అన్నారు.



వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో సుపరిపాలన సక్సెస్‌పై కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మోహన్ మురళి, తెలుగు యువత అధ్యక్షులు కిషన్ చందు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పురుషోత్తం పాల్గొన్నారు.

బూత్ లెవల్ ఏజెంట్ల

జాబితా సమర్పించాలి: డీఆర్వో



రాజకీయ పార్టీల నాయకుల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లెయిములకు సకాలంలో స్పందించి పరిష్కరించడం జరుగుతున్నదని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణపై డిఆర్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు డిఎం అండ్ హెచ్ఓ, డిఆర్‌డిఏ పీడీల సమన్వయంతో ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా మరణించిన వారి జాబితాను సిద్ధం చేయడం జరిగిందని, మరణించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడానికి చర్యలు చపట్టామని తెలిపారు. ఈ ప్రక్రియను అన్ని నియోజకవర్గాలలో చేపట్టడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బిఎల్‌ఓలు ఓటరు జాబితాలో పేర్లు, నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లైమ్‌ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వారీగా బూతు లెవెల్ ఏజెంట్‌ల నియాకం కొరకు బిఎల్ఏ- 2 ఫారంను పూరించి సమర్పించాలని రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కొరకు 15,497 దరఖాస్తులు అందగా 1,595 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశానికి టిడిపి ప్రతినిధి సురేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, వైసిపి ప్రతినిధి ఉదయ్ కుమార్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, ఎలెక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై అవగాహన కల్పించాలి

డిఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుధారాణి



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి జిల్లాలోని వైద్యాధికారులతో 'ఇంటెన్సిఫైడ్ డయేరియాల్ కంట్రోల్ ఫోర్ట్ నైట్' పై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ శిశు మరణాల నివారిణే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. కావున 0-5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలు అందరిని ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడి కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించి పిల్లల లిస్టు తయారుచేసి తల్లిదండ్రులందరికీ ఈనెల 16 నుంచి జూలై 31 వరకు ఈ కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, అలాగే అందరి పిల్లలకు రోట వాక్సినేషన్ తప్పక వేయించుకునేటట్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని పిహెచ్సిలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ కార్నర్ తప్పకుండా పట్టించాలని, ఎవరైనా అనుమానితో పిల్లలకు డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఓఆర్ఎస్, జింక్ మాత్రలతో చికిత్స ప్రారంభించి డాక్టర్ వద్దకు పంపాలని సూచించారు. అందరూ లైన్ డిపార్ట్మెంట్ తో కలిసి స్టాప్ డయేరియా క్యాంపింగ్-2025 కార్యక్రమం ద్వారా శిశు మరణాలు లేని సమాజం నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి విద్యుత్ సరఫరా..

ప్రజాశక్తి- తవణంపల్లి: మండల కేంద్రం స్వయం సహాయక వెలుగు కార్యాలయంలో గురువారం ప్రతి కుటుంబానికి సోలార్ విద్యుత్ సరఫరా అందించడంపై సంఘమిత్ర మహిళలకు అవగాహన కల్పించారు. సోలార్ సిస్టం ద్వారా ప్రతి కుటుంబానికి విద్యుత్ సరఫరా అందించడమే పియం సూర్యా గర్ స్కీమ్ ఉద్దేశమని అరగొండ ఏఈ కృష్ణ కిషోర్ తెలిపారు. ఈ స్కీమ్‌లో ఒక కిలోవాట్‌కు రూ.30వేలు, గరిష్టంగా రూ.78వేలు సబ్సిడీ వినియోగదారులకు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపిఎం రవి, విద్యుత్ డిపార్ట్మెంట్ ఏఈ తారా దేవి, సీసీలు హేమచంద్ర రెడ్డి, వేదా ప్రకాష్ సంఘమిత్రాలు పాల్గొన్నారు.

రైతుకు తప్పని విత్తన వెతలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

ఏ ప్రభుత్వం వచ్చినా రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదు. గత కొన్ని సంవత్సరాల నుండి రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావట్లేదు. ప్రకృతి కరుణించట్లేదని రైతు నెత్తినోరు కొట్టుకుంటున్నాడు. దీనికి తోడు దళారీలు ఎప్పటికప్పుడు రైతులను మోసం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అందుబాటులోనే ఉంటున్నామని చెబుతోందని తప్ప ఆచరణ శూన్యం. రైతులను చైతన్యవంతులను చేయడానికి రైతు సదస్సులు పెడుతున్నారు గాని వారికి సకాలంలో విత్తనాలు ఇవ్వట్లేదు.

బైరెడ్డిపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్లో వేరుశనగ విత్తనాలను 1313 క్వింటాళ్లు ఇవ్వడం జరిగింది. ఆ విత్తనాలు బస్తాకు 30 కేజీలు అవి శు భ్రపరిస్తే బస్తాకు 10 కేజీలు గింజలు కూడా రావట్లేదు అని రైతులు వాపోతున్నారు. మండలం మొత్తానికి ఇంచుమించు మూడు వేల క్వింటాళుఅయినా విత్తనాలు అవసరం ఉండగా 1313 క్వింటాళ్లు మాత్రమే ఇస్తే అవి ఎక్కడికీచాలవు. ఒక రైతుకు ఒక బస్తా చెప్పున ఇస్తే కూడా ఇంకా 980 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు వారికి తగ్గుతున్నాయి. ఒక రైతుకు ఐదు ఎకరాల మెట్ట భూమి ఉంటే ఒక బస్తా శుద్ధి చేస్తే 10 కేజీలు గింజలు ఇచ్చే విత్తనాలు సరిపోతాయా అని రైతుల ప్రశ్నిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్లో వేరుశనగ విత్తనాలు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. రైతులకు సరిపడా విత్తనాలను సకాలంలో ప్రభుత్వం సరఫరా చేయడంలో విఫలమైంది. రైతులు పంట పండించాలంటూ సంసిద్ధులను చేసే ప్రక్రియ కష్టతరమైనదైతే, సిద్ధంగా ఉన్న రైతులకు విత్తనాలను సకాలంలో అందించలేకపోవడం ఎంతవరకు సమంజసం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పండించడానికి సిద్ధంగా ఉన్న రైతులకు ఎన్నిసార్లు ఇటువంటి కష్టాలు ఎదురవుతాయి. బీరకాయ పండించిన రైతులు అప్పుల పాలయ్యారు, టమాటా పండించిన రైతులు నష్టాల పాలయ్యారు, మామిడి పండించిన రైతులు మెంటల్ ఎక్కి గోక్కుంటున్నారు. వేరుశనగను పండిద్దామనుకుంటున్న రైతులకు నాసిరకం విత్తనాలను సప్లై చేసి అవి కూడా చాలీచాలకుండా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇదా రైతులకు మీరు చేస్తున్న సహాయం అంటూ రైతన్నలు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా కొన్ని రోజుల లోపల వేరుశనగ విత్తనాలను రైతులకు అందించలేకపోతే రైతులు పంటను పండించడానికి అయిష్టత చూపుతారు, ఆ తర్వాత మండలంలో వేరుశనగ పంట దిగుబడి తగ్గిపోవడం ఖాయం. మండలంలో వేరుశనగ పంట ప్రధానంగా చేస్తుంటారు విత్తనాలు సరిపడా ఇవ్వకుండా సాగు చేస్తున్న రైతులు సైతం నీరుగాస్తున్నారు.



మండలంలోని రైతులకు నాశిరకం విత్తనాలు వచ్చినట్లు అగ్రికల్చర్ ఆఫీసర్ గీతా కుమారిని ప్రశ్నించగా కొన్ని బస్తాలు రావడం వాస్తవమేనని, అప్పటికప్పుడు రైతులు వాటిని చెక్ చేసుకున్నట్లయితే తిరిగి వేరేవి ఇచ్చేవారని, కానీ అలా చేయకుండా మొత్తం వాళ్లే శుద్ధి చేసిన తర్వాత తీసుకొస్తున్నారని ఆమె సమాధానం ఇచ్చారు. వేరుశనగ విత్తనాలు మళ్ళీ ఎప్పుడు వస్తాయని ఆమెను అడుగగా ప్రభుత్వం అందించిన వెంటనే అందరికీ ఇస్తామని ఆమె తెలియజేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలను అందించి సహకరించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

బాలల హక్కులను హరిస్తే కఠిన చర్యలు

ఘనంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ :

బాలల హక్కులను హరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి భారతి స్పష్టం చేశారు. గురువారం స్థానిక జిల్లా కోర్టులోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రూరల్ ఎడ్యుకేషన్ అండ్ లిబర్టీ (రియల్) సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేకదినాన్ని నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ కొందరు వ్యక్తులు అభం శుభం ఎరుగని ఎంతో మంది బాలలను నేడు కార్మికులుగా మారుస్తూ వారిచే గొడ్డు చాకిరి చేయించుకుంటున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. బాలల కోసం భారతీయ శిక్షాస్మృతిలో ప్రత్యేక చట్టాలను రూపొందించారని, వాటిని ప్రతి ఒక్కరూ అమలు చేసి తీరాల్సిందేనన్నారు. 18 సంవత్సరాల లోపు బాలలను నిర్బంధంగా పనుల్లో పెట్టుకొని వెట్టిచాకిరి చేయించుకుంటున్న వారిపై దాడులు నిర్వహించాలని కార్మిక శాఖకు, పలు ఎన్జీవో సంస్థలకు సూచించారు. స్థానిక రియల్ సంస్థ నిర్వాహకులు ఎస్.రామారావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు వందలాది సంఖ్యలో బాల్యవివాహాలను అడ్డుకున్నామని వెల్లడించారు. బాల కార్మికుల వివరాలను తమ సంస్థకు తెలియజేస్తే తప్పకుండా వారికి విముక్తి కల్పిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ అధికారి ఓంకార్, ఏఎల్ఓ రాజయ్య, న్యాయవాదులు, రియల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందించకుంటే సమ్మె తప్పదు

సమ్మెకు సిద్ధమైన కాంట్రాక్ట్ ఉద్యోగులు



కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న ఒప్పంద కార్మికులు

ప్రజాశక్తి- పుంగనూరు: పురపాలక సంఘలలో ఒప్పంద కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించడం లేదని ఇక సమ్మె తప్పదని ఆ సంఘ నాయకుడు శ్రీరాములు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సెక్షన్‌లో జీతాలు పెంపుకై సమస్యల పరిష్కారం కోసం సమ్మె నోటీసు కమిషనర్ మధుసూదన్ రెడ్డికి గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులకు, టెక్నికల్ సిబ్బందికి జీతం నెలకు రూ.29,200లు, నాన్ టెక్నికల్ కు జీతం రూ.24,500లు అమలు అయ్యే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ రంగంలో ఒప్పంద కార్మికులందరికీ హెచ్‌ఆర్ పాలసీ పరిధిలోకి తీసుకోవాలన్నారు. 34 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ఇప్పటికీ ప్రభుత్వం స్పందించిన కారణంగా రాష్ట్రంలోని అన్ని యూనియన్లు ఐక్య కార్యచరణ కమిటీగా ఏర్పాటు చేసి నోటీసిచ్చిన 14 రోజుల తర్వాత అంటే ఈ నెల 22 నుండి సమ్మె చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమ్మె కారణంగా ప్రజల ఇబ్బంది కలిగితే అందుకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, బాలు, కేశవ పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలి

యూనియన్ గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు. గురువారం మండలంలోని నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిడిపిఓ వినితశ్రీని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం యాదమరి మండలం, బంగారుపాళ్యం మండలాల్లోని అంగన్వాడీ కార్యకర్తలకు విడివిడిగా మండల కేంద్రాల్లో సమావేశం నిర్వహించాలని, తద్వారా అంగన్వాడీలకు వచ్చి వెళ్లడానికి అనుకూలంగా ఉటుందని తెలిపారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించే సామగ్రిని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. గతంలో ఏ విధంగా అయితే సమావేశాలు నిర్వహిస్తున్నారో అదే విధంగా ఇకపై సమావేశాలు నిర్వహిస్తామని సిడిపిఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు షకీలా, వరలక్ష్మి, మమత, గీత, భారతి, జమున, కవిత పాల్గొన్నారు.

సిడిపిఓగా వినతి శ్రీ బాధ్యతలు స్వీకరణ

బంగారుపాళ్యం ప్రాజెక్ట్ సిడిపిఓగా వినతి శ్రీ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జీడీ నెల్లూరు సీడీపీవోగా పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా బంగారుపాళ్యం సిడిపిఓగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సిడిపిఓగా పనిచేస్తున్న వాణి శ్రీదేవి పులిచెర్ల సిడిపిఓగా బదిలీపై వెళ్లారు. గతంలో ఇక్కడ ఏసిడిపిఓగా పనిచేసిన అనుభవంతో మండలంలో అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తానని సిడిపిఓ వినతిశ్రీ తెలిపారు.

సమయపాలన పాటించాలి

సీడీపీవో శోభారాణి



ప్రజాశక్తి- కార్వేటినగరం: అంగన్వాడీ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరి పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో శోభారాణి అన్నారు. గురువారం కార్వేటినగరం సీడీపీవోగా శోభారాణి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచ్చాటూరు సీడీపీవోగా పనిచేస్తూ బదిలీపై కార్వేటినగరం వచ్చినట్లు తెలిపారు. కార్వేటినగరంలో సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న పద్మసునంద గంగాధరనెల్లూరుకు బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది చిన్నారులకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహించినా, విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్వేటినగరం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు శోభారాణిని శాలువలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఆకట్టుకున్న హరికథా గానం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజు మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం పాండవుల హరికథ గానం భక్తులను ఆకట్టుకుంది. భాగవతారిణి డాక్టర్ విజయ కుమారి మహాభారతంలోని పలు ఘటాలను వివరించారు. భక్తులు ద్రౌపది అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, సర్పంచ్ హరిత కుప్పయ్య, రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, ఎత్తురాజుల నాయుడు, కేశవులునాయుడు, సుదర్శన్ నాయుడు, సుబ్రహ్మణ నాయుడు, మాధవ నాయుడు, బ్రహ్మనాయుడు, గోవర్ధన్ మందడి, మోహన్ నాయుడు పాల్గొన్నారు.

'విమానం కూలిపోవడం బాధాకరం'

ప్రజాశక్తి- పుంగనూరు: గుజరాత్ నుంచి లండన్ వెళ్లే భారతీయ విమానం గాల్లోనే కొద్ది దూరం ఎగిరి కిందపడి పేలిపోవడం బాధాకరమైన విషయమని జిల్లా ప్రియాంక సేవ దళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా గురువారం ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. విమానంలో ప్రయాణిస్తున్న సుమారు 200 మంది పైగా ప్రయాణికులు, విదేశీయులు భోజనం చేస్తున్న సమయంలో విమానం వారి మీద పడి వైద్య విద్యార్థులు చనిపోవడం బాధాకరమన్నారు. మరణించిన వారికి సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వేణుగోపాలస్వామి ఆలయం

హుండీ ఆదాయం రూ.1.25 లక్షలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.1.25 లక్షలు వచ్చినట్లు టీటిడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణంలో పరకామణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారిని దర్శించుకున్న భక్తులు సమర్పించుక కానుకలను టీటీడీ సిబ్బందిచే పరకామణి నిర్వహించడం జరిగిందని, హుండీ ద్వారా వచ్చిన రూ.1,25,757లు ఆదాయాన్ని స్వామివారి ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే టీటీడీ అనుబంధంగా ఉన్న ఆలత్తూరు గ్రామంలోని వరద వెంకటేశ్వరస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.1822లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షారాబ్ బాబు సురేష్, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత

పుణ్యసముద్రం జట్టు



ప్రజాశక్తి- ఐరాల: మండలంలోని కాణిపాకం పరిసరాల్లోని చిగరపల్లి గ్రౌండ్‌లో గతనెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్లో దాదాపు 20కిపైగా జట్లు పోటీ పడ్డాయి. ఇందులో ఫైనల్‌కి పుణ్యసముద్రం, అరుణనగర్ జట్లు చేరుకున్నాయి. రసవత్తరమైన ఫైనల్ మ్యాచ్లో అరుణనగర్‌పై పుణ్యసముద్రం టీమ్ గెలిచింది. విజేతలకు నిర్వాహకులు మొదటి బహుమతిగా రూ.15వేలు, అరుణనగర్ టీంకి రూ.10వేలు నగదు బహుమతిని అందించారు. ఈ క్రికెట్ టోర్నీలో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన పుణ్యసముద్రం వసంత్ కుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రాగా, ఇతర ప్లేయర్లకు నిర్వాహకులు వివిధ ప్రోత్సాహకాలు అందించారు.

నేడు శ్రీకాళహస్తిలో వైఎస్ షర్మిల పర్యటన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జిల్లాల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తికి రానున్నారు. ఆ పర్యటన వివరాలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు దొడ్డా రెడ్డి రాంభూపాల్ రెడ్డి మీడియాకు వివరించారు. పట్టణంలో ర్యాలీ అనంతరం స్థానిక ఆర్జిఆర్ కళ్యాణ మండపంలో షర్మిల సభ ఉంటుందని చెప్పారు. పార్టీని సంస్థాగతంగా అభివద్ధి చేయుటపై జిల్లాస్థాయి విస్తత సమావేశంలో షర్మిల దిశా నిర్దేశం చేయనున్నారు.

పాకాల అగ్రికల్చర్ ఏఓను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పాకాల మండలంలో ప్రభుత్వం ఇస్తున్న వేరుశనగ సబ్సిడీ విత్తనాలు మధ్యాహ్నానికి అయిపోయాయని గడియ పెట్టడం శోచనీయమని, ఏఓను సస్పెండ్ చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.హేమలత మండిపడ్డారు. రైతులు విత్తనాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తుంటే విత్తనాలన్నీ ఒక్క పూటలోనే ఎవరికి ఇచ్చారో జాబితా బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. లేకపోతే అధికార పార్టీ ఇళ్లకు వెళ్లాయనే అనుమానం వస్తుందన్నారు. చిన్నసన్న కారు రైతులకు విత్తనాల పంపిణీ చేయకపోతే పొలాల్లో ఎలా వేరుశనగసాగు చేయగలరన్నారు. మండలంలోని రైతులకు సరిపడా విత్తనాలు ఇవ్వకపోయినా, కనీసం అరకొర విత్తనాలైనా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. విత్తనాలు ఎవరికి పంపిణీ చేశారో నోటీసు బోర్డులో జాబితా అతికించాలని కోరారు.

అహ్మదాబాద్ విమాన మృతులకు

సిఐటియు సంతాపం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నగరం నుంచి లండన్ వెళ్లాల్సిన బోయింగ్ విమానం ప్రమాదవశాత్తు కుప్పకూలింది. ప్రయాణికులు, విమాన సిబ్బంది, మెడికోల మృతికి సిఐటియు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. ఈ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, విమాన సర్వీసుల నిర్వహణ లోపాల కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా వెలువడిన వార్తలను బట్టి తెలుస్తుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి పేర్కొన్నారు.

విద్యా మిత్ర కిట్ల పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తూగుండ్రం గ్రామంలో గురువారం ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు కూటమి ప్రభుత్వం విద్యాసామగ్రి వస్తువులను పంపిణీ చేసింది. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కాణిపాకం సుధాకర్ ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు పిల్లలకు నోట్ బుక్స్, అచ్చు పుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీ చేశారు. తూగుండ్రం పిహెచ్సి మాజీ ఛైర్మన్ నరసింహులు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జీవరత్నం, జిల్లా క్రిస్టియన్ సెల్ కార్యదర్శి శాంత్ కుమార్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్, ఉపాధ్యక్షుడు శేఖర్ శెట్టి, స్కూల్ కమిటీ మెంబర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.



సోమలలో..

సోమల: మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర సామగ్రిని మండల విద్యాశాఖ అధికారిని శివరత్నమ్మ, ఉపాధ్యాయ బృందం పంపిణీ చేశారు.



బైరెడ్డిపల్లిలో..

ప్రధానోపాధ్యాయులు నాగరాజా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నోటు పుస్తకాలు, అచ్చు పుస్తకాలు, షూలు, బెల్టు, బ్యాగు మధ్యాహ్నం భోజనం ఉచితంగా అందజేస్తుందని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.

తవణంపల్లి: మండలంలోని 66 పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లల పంపిణీలో భాగంగా పాఠ్య పుస్తకాలను నోట్ పుస్తకాలు, డిక్షనరీలను విద్యార్థులకు అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారి హేమలత తెలిపారు. గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఎంఈవో పంపిణీ చేయడం జరిగింది.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర విద్యా సామగ్రిని అందించారు.

11 గంటలైనా తెరుచుకోని సచివాలయం

ఎదురు చూడక తప్పదంటున్న అర్జీదారులు

ప్రజాశక్తి- పలమనేరు రూరల్ (గంగవరం):

పలమనేరు రూరల్ మండలంలోని పెంగరగుంట గ్రామపంచాయతీలో ఉదయం 11గంటలు కావస్తున్నా సచివాలయ సిబ్బంది విధులకు హాజరు కాకపోగా కనీసం ఆఫీస్ ఓపెన్ కూడా చేయడం లేదు. సచివాలయ సిబ్బంది కార్యాలయానికి సమయానికి రాకపోవడంతో పలు పనులపై వచ్చిన అర్జీదారుల బయట ఎండలోనే నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా సచివాలయ సిబ్బంది పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, గంటల తరబడి వేచి ఉన్నా పట్టించుకోవడం లేదని, సెల్ ఫోన్‌తోనే కాలయాపన చేస్తూ సరైన సమాచారం కూడా ఇవ్వరని ప్రజలు ఆరోపిస్తున్నారు. వయస్సు మల్లిన వారు, వికలాంగులను సైతం పట్టించుకోకుండా దురుసుగా మాట్లాడతారని చెబుతున్నారు. పలు సచివాలయాల్లో ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కావడం లేదని, మధ్యాహ్నం మూడు గంటలకి కార్యాలయంలో ఎవరో ఒకరు తప్ప మిగిలిన వారు కనపడరని అంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే సిబ్బందిలో నిర్లక్ష్యం పెరిగిందని, మండల అధికారులు వారంలో ఒకటి రెండుసార్లు సచివాలయాన్ని తనిఖీలు చేస్తే ఇటువంటి బయట పడతాయని గ్రామస్తులు అంటున్నారు.



11 గంటలైనా తాళం వేసి ఉన్న సచివాలయం

పారిశ్రామిక వాడల సందర్శనకు మహిళలు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గంలో భవిష్యత్తు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న మహిళలు పారిశ్రామిక వాడల సందర్శనార్థం గురువారం కుప్పం నుండి బయలుదేరారు. పట్టణంలోని కడా కార్యాలయం నుండి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో బయలుదేరిన మహిళలను ఎమ్మెల్సీ, కడా అధ్యక్షులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, సభ్యులు డాక్టర్ సురేష్ బాబు, పిఎస్ మునిరత్నం, పీడీ వికాస్ మరమ్మత్‌లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళ ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా, ఆయన ఆదేశానుసారం ఆలిప్ సంస్థ సహకారంతో మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రెండు విడతలగా జరిగిన శిక్షణ కార్యక్రమంలో 100మంది మహిళలు శిక్షణ పొందినట్టు తెలిపారు. వీరు భవిష్యత్తులో పూర్తి పారిశ్రామికవేత్తలుగా రాణించడానికి, వారికి ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలు, వాటి రాయితీలు, బ్యాంకు వారికి అందించవలసిన గ్యారెంటీల పై అవగాహన కల్పించడానికి ముఖ్యమంత్రి ఆదేశాలతో పారిశ్రామిక వాడల సందర్శనలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందులో భాగంగా కుప్పం నియోజకవర్గ పరిధిలోని 35 మంది మహిళలు హైదరాబాదు నగరంలోని ఆలిప్ సంస్థకు సంబంధించిన పారిశ్రామిక వాడలను సందర్శించనున్నట్టు తెలిపారు.



కుప్పం నుండి బయలుదేరిన మహిళలు

కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతికి ఎగనామం పెట్టింది..

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎగనామం పెట్టారని వైఎస్ఆర్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కిషోర్ కుమార్ రెడ్డి విమర్శించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈనెల 13వ తేదీన శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా విద్యార్థి విభాగం, యువజన విభాగాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం వద్ద విలేకరులతో వారు మాట్లాడారు. ఒక ఏడాది కాలంగా ఉన్నత చదువులు చదువుకునే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిధులు చెల్లించకపోవడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగులను ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఈనెల 13న చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టే నిరసనకు యువత పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించడం జరుగుతుందని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కిషోర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బుక్కా పట్నం సర్పంచ్ ముని రాజారెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, ఢిల్లీ కుమార్, వాసుదేవరెడ్డి, రాజేంద్ర నాయుడు, విష్ణు, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కుటుంబ కలహాలతో

తండ్రిని చంపిన తనయుడు





మృతుడు వెంకటరెడ్డి, హత్య చేసిన సోమశేఖర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కుటుంబ కలహాలతో కన్న తండ్రిని హత్య చేసిన సంఘటన గురువారం చిత్తూరు నగర పరిధిలోని 47వ డివిజన్ లెనిన్ నగర్ చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపిన వివరాల మేరకు.. మృతుడు వెంకటరెడ్డి (57) లెనిన్ నగర్‌లో భార్యా పిల్లలతో 20 సంవత్సరాలుగా కాపురం అంటున్నాడు. మద్యానికి బానిసైన వెంకటరెడ్డి తరచు మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవలు పడేవాడు. బుధవారం కూడా తాగి వచ్చి కుటుంబ సభ్యులను తీవ్రంగా దూషించడంతోపాటు కొట్టి గాయపరిచాడు. తండ్రి ప్రవర్తన నచ్చని కుమారుడు సోమశేఖర్ (25) గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో తండ్రితో గొడవ పడుతూ కత్తితో దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమశేఖర్ లొంగిపోయినట్లు సిఐ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకు

కొనుగోలు చేయాలి: ఆర్‌డీవో



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తోతాపురి మామిడి రకంను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేయాలని పలమనేరు ఆర్‌డిఓ భవాని అన్నారు. గురువారం మండలంలోని నల్లగాంపల్లి వద్దగల సన్ గోల్డ్ గుజ్జు పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో ప్రభుత్వం నిర్ణయించిన ధరతో రైతుల వద్ద నుండి మామిడి కొనుగోలు చేపట్టాలని కొనుగోలు అనంతరం వారికి ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీకి సంబంధించిన పత్రాలను నమోదు చేసుకుని సిద్ధం చేసి ప్రభుత్వాన్ని పంపాలన్నారు. ఇందుకు పరిశ్రమలోనే ప్రభుత్వ సిబ్బందిని నియమిస్తున్నామని, వీఆర్వో రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా నివేదికలను పంపాలన్నారు. అనంతరం పరిశ్రమ మొత్తం పరిశీలించారు. తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఎస్‌కే సిబ్బంది కోకిల, పరిశ్రమ నిర్వాహకులు ధనంజయ నాయుడు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి : తహశీల్దార్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రహదారి నిర్మాణానికి అభ్యంతరాలు ఉంటే తెలపాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని తుంబ గ్రామపంచాయతీ వీఆర్వో నవీన్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తుంబ గ్రామంలో ఎస్టీ కాలనీ నుండి జగమర్ల పంచాయతీ దేవళంపేట ఎస్టి కాలనీ వరకు నాలుగు కిలోమీటర్ల మట్టి రోడ్డు కలిగి రాకపోకలు సాగిస్తున్నారని, సదరు రోడ్డు మధ్యన 1.7 కిలోమీటర్లు అటవీ భూములు ఉన్నాయని, ఈ రహదారి నిర్మాణానికి గ్రామస్తుల ఆమోదం కొరకు గ్రామసభ పెట్టినట్లు తెలిపారు. గ్రామప్రజల ఆమోదం తెలిపేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసామని ప్రజల సమ్మతితో నివేదికలు పంపేందుకు అనుమతిని తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. స్పందించిన ప్రజలు, రైతులందరు ఈ రహదారి చాలా సౌకర్యంగా ఉందని, ఈ రహదారిని బీటీ రోడ్డు నిర్మాణంకు ఎలాంటి అభ్యంతరం లేవని తహశీల్దార్‌కు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉషశ్రీ, మండల సర్వేలు లావణ్య, మాజీ సర్పంచ్ కోదండ యాదవ్, ఎఫ్ఎస్ఓ మోహన్ మురళి, ఎఫ్‌బిఓ మనోజ్, గ్రామ ఉపసర్పంచ్ చిరంజీవి, మాజీ ఎంపీటీసీ శివ రాజ పాల్గొన్నారు.

స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, రెండున్నర సంవత్సరాలుగా అనేకమార్లు అధికారులకు విన్నవించినా, ధర్నాలు చేసినా సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈనెల నాలుగో తేదీ స్విమ్స్ డైరెక్టర్‌కు, టిటిడి ఛైర్మన్, ఈవోలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక శాఖకు, కలెక్టర్‌కు సమ్మె నోటీసు పంపినట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి తెలిపారు. సమ్మె నోటీసు పంపి ఎనిమిది రోజులు అవుతున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరించడంతో స్విమ్స్ ఎమర్జన్సీ వార్డు ముందు ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్మికులు గురువారం పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.మాధవ్, హాకర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.బుజ్జి పాల్గొన్నారు. శానిటేషన్ పేరు మార్పు చేసి, గతంలో వలే వార్డు బాయిలుగా పరిగణించాలని రెండున్నరేళ్లుగా డిమాండ్ చేస్తూనే ఉన్నామన్నారు. అధికారులు చేసిన పొరబాటుకు ఏళ్ల తరబడి తక్కువ వేతనాలకు పని చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే 18వ తేదీ నుంచి సమ్మెబాట పడతామని హెచ్చరించారు. అధికారులు బెదిరింపులు మాని సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రవి, సూరి, వెంకటేష్, గోపి, బాష, వేలు, కుమారి, జయమ్మ పాల్గొన్నారు.

ముగిసిన 'ఏపిపిజిసెట్' పరీక్ష

ప్రజాశక్తి - క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పక్షాన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏపిపిజిసెట్-2025 పరీక్షలు 9వ తేదీ నుంచి 12 వరకు నిర్విఘ్నంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కన్వీనర్ ఆచార్య పిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో పకడ్బందీగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, రోజుకు మూడు సెషన్స్ లెక్కన మొత్తం 10 సెషన్స్ లో 31 సబ్జెక్టులకు ఎంట్రన్స్ జరిగాయన్నారు. 14 కేంద్రాల్లో (హైదరాబాద్ సహా) పరీక్షలు జరిగాయని, 25,688 మంది విద్యార్థులు పిజి ఎంట్రన్స్ కు దరఖాస్తు చేసుకున్నారని, 22 వేలమంది విద్యార్థులు 86 శాతం పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన వివిధ సబ్జెక్టుల కీ విడుదల చేస్తున్నామని, విద్యార్థులు కీ పరిశీలించి తమ అభ్యంతరాలను వెబ్‌సైట్‌లో తెలియజేయాలన్నారు. ఫైనల్ కీ సిద్ధం చేసి ఈ నెల 25వ తేదీ ఫలితాలు విడుదల చేస్తున్నామని వివరించారు. పిజి సెట్ టీం సభ్యులుగా నిరంతరం కష్టపడిన కామేశ్, నాగభూషణం, సుకుమార్, సునీల్, వీరభద్ర, వీరనాచారి, కో కన్వీనర్ ఆచార్య సురేంద్ర బాబులను అభినందించారు.

పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం

ఈ ఏడాది 3వేల ఎకరాల్లో లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర చిన్న సన్నకారు రైతులకు ఐదు ఎకరాల లోపు ఉన్న వారికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి 3వేల ఎకరాల్లో 18 రకాల పండ్లతోటలు, రెండు రకాల పూలతోటలు పండించేందుకు జిల్లా నీటిపారుదల శాఖ నిర్ణయం తీసుకుంది. మామిడి, జీడిమామిడి, నిమ్మ, తైవాన్‌జామ, జామ, సపోట, కొబ్బరి, అల్లనేరేడు, చింత, సీతాఫలం, దానిమ్మ,డ్రాగన్, మునగ, మల్లి, గులాబి, పనస, అంజూర ఉద్యానవన పంటలు పండించేందుకు ఉచితంగా మొక్కలను అందించనుంది. గత ఏడాది జిల్లాలో 1211 ఎకరాల్లో వర్షాధారిత ఉద్యానవన పంటలు చేపట్టింది. ఈ ఏడాది మూడువేల ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. జాబ్‌కార్డు ఉన్న అందరూ అర్హులుగా ఉద్యానవన శాఖ అధికారి పేర్కొన్నారు. మండల అధికారులు సంబంధిత ఎంపిడిఒలను, ఉపాధి ఎపిఒలను సంప్రదించాలని సూచించారు.

విజయాలకు కేరాఫ్ 'విద్యాజ్యోతి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఉన్న 'శ్రీ విద్యాజ్యోతి' ఇంగ్లీష్ మీడియం స్కూల్ విజయాలకు కేరాఫ్ గా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తూ అప్రహిత విజయాలను సాధిస్తోంది. బేబీ క్లాస్, ప్రాథమిక విద్యా స్థాయిలోనే విద్యార్థులకు అందిస్తున్న సజనాత్మకతతో కూడిన నాణ్యమైన విద్య ద్వారానే ఈ విజయాలు సాధ్యపడుతున్నట్లు కరస్పాండెంట్ సి. సంయుక్త రెడ్డి, ప్రిన్సిపాల్ సి. ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో విడుదలైన పదో తరగతి ఫలితాల్లో సైతం విద్యా జ్యోతి స్కూల్ విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. 500 మార్కులు, అంతకుమించి మార్కులు సాధించిన విద్యార్థులు వందమందికి పైగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. పాఠశాలకు చెందిన ప్రీతం 583 మార్కులు, మనోజ్ 580, గీతిక 578, భావన 578 మార్కులు సాధించి పాఠశాల, పట్టణ స్థాయిలో టాపర్లుగా నిలిచారు. బేబీ క్లాస్ నుంచి పదో తరగతి వరకు ఇప్పటికే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయనీ, వివరాలకు సెల్ : 9966391914 నంబరును సంప్రదించాలని కోరారు. ఫైర్ సేఫ్టీ తో కూడిన విశాలవంతమైన భవనంలో తరగతులు నిర్వహిస్తున్నామని యాజమాన్యం తెలిపింది. హాస్టల్, బస్సు సౌకర్యం కలదని తెలియజేశారు. 'కలలు కనడం తల్లిదండ్రుల బాధ్యత అయితే.. వాటిని నెరవేర్చడం విద్యాజ్యోతి బాధ్యతని కరస్పాండెంట్ సంయుక్త రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

శేఖర్‌పై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - పిచ్చాటూరు

బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఎన్.శేఖర్ (55)పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సిఐ రవీంద్ర తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ నిందితుడు శివలింగం కుమారుడు శేఖర్ కారూరు దళితవాడు వాసి. 15 సంవత్సరాల బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేయడమే కాకుండా, ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. బాలిక తల్లికి చెప్పడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ముద్దాయికి చనిపోయే వరకూ జైలుశిక్ష పడే అవకాశం ఉందని, మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడరాదన్నారు.

